

# జాడలేని భారత్ రైస్

- ప్రారంభించి నెలలైనా అందని సబ్సిడీ బియ్యం
- కానరాని నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ అడ్రస్..
- అమలుకు నోచుకోని ప్రధాని మోదీ హామీ
- ఆడంబరమే తప్ప అమలు శూన్యం

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ప్రధాని మోదీ ఆర్భాటంగా ప్రకటించిన భారత్ రైస్ జాడ లేకుండా పోయింది. ప్రారంభించి తొమ్మిది నెలలైనా పేదోడికి సబ్సిడీపై సన్న బియ్యం అందని ద్రాక్షగానే మిగిలింది. రూ. 29కే భారత్ రైస్ (సన్న బియ్యం) ఇవ్వనున్నట్లు ప్రకటించిన ప్రధాని మోదీ ఈ ఏడాది ఫిబ్రవరి 7న అధికారికంగా ప్రారంభించారు. నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్), నేషనల్ కోఆపరేటివ్ కన్జ్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్), కేంద్రీయ భండార్ సంస్థలు, మొబైల్ ఔట్‌లెట్ల ద్వారా భారత్ రైస్‌ను 5, 10 కిలోల బ్యాగుల్లో విక్రయించనున్నట్లు ప్రకటించారు. అయితే నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సెంటర్లు ఉమ్మడి జిల్లా పరిధిలోనే ఎక్కడా కానరావడం లేవు. అసలు రాష్ట్ర వ్యాప్తంగానే భారత్ రైస్ విక్రయాలు జరగడం లేదని అధికారులు తెలుపుతున్నారు. ప్రధాని మోదీ ఆడంబరంగా ప్రారంభించిన భారత్ రైస్ హామీ అమలుకు నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వరి ఉత్పత్తి పెరిగినప్పటికీ.. బియ్యం ధరలు మాత్రం తగ్గడం లేదు. ఈ క్రమంలో సామాన్యులకు ఊరట కలిగించేలా ప్రకటించిన భారత్ రైస్ హామీ ఆదిలోనే ఆగిపోయింది.

**పేదలకు అందని కేంద్ర బియ్యం**

మార్కెట్లో సోనా మసూరి, జై శ్రీరాం లాంటి వెరైటీలు కిలోకి రూ. 60 నుంచి రూ. 80 వరకు ధర పలుకుతున్నాయి. ఈ క్రమంలో కేంద్రం ప్రవేశపెట్టిన భారత్ రైస్ పేదల్లో ఆశలు రేకెత్తించింది. సన్న బియ్యం అందుబాటులోకి వచ్చాయని భావించినప్పటికీ ఇది ఆదిలోనే ఆగిపోయింది. ఫలితంగా గరీబోళ్ల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ సంస్థల ద్వారా బియ్యం విక్రయాల అడ్రస్ లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కొరవడడంతో అసలు భారత్ రైస్ విషయమై ప్రజలకు అవగాహన లేకుండాపోయింది. అధికారులకు సైతం సమాచారం లేని పరిస్థితి నెలకొంది.

### సమాచారం లేదు



ప్రారంభోత్సవ సమయంలో నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ సంస్థల సెంటర్లు, మొబైల్ ఔట్‌లెట్ల ద్వారా భారత్ రైస్‌ను 5, 10 కిలోల బ్యాగుల్లో విక్రయించనున్నట్లు ప్రకటించారు. ఇంతవరకు ఈ విషయమై మాకు ఎలాంటి సమాచారం లేదు.

– రాములు, పౌరసరఫరాల అధికారి, భూపాలపల్లి జిల్లా

# వరంగల్ -సికింద్రాబాద్ పుష్‌పుల్ షురూ..

కాజీపేట, నవంబర్ 2 : సికింద్రాబాద్– వరంగల్–సికింద్రాబాద్ మధ్య ప్రతి రోజు మధ్యాహ్నం పుష్‌పుల్ రైలును శనివారం నుంచి నడిపిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. గతంలో కరోనా వల్ల కాజీపేట– సికింద్రాబాద్, సికింద్రాబాద్– వరంగల్, వరంగల్–సికింద్రాబాద్, సికింద్రాబాద్– కాజీపేట మధ్య నడిచే పుష్‌పుల్ రైళ్లను రద్దు చేసింది. వరంగల్ ప్రజల విజ్ఞప్తి మేరకు రైల్వే అధికారులు ఈ పుష్‌పుల్ రైలును తిరిగి నడిపిస్తున్నట్లు తెలిపారు. ఈ రైలు సికింద్రాబాద్‌లో 07462 నంబర్‌తో ప్రతిరోజు ఉదయం 9.35 గంటలకు బయలుదేరి వరంగల్‌కు మధ్యాహ్నం 1.15 గంటలకు చేరుకుంటుంది. తిరిగి 07463 నంబర్‌తో మధ్యాహ్నం 1.45 గంటలకు వరంగల్ నుంచి బయలుదేరి, సికింద్రాబాద్‌కు సాయంత్రం 5.55 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ




పుష్‌పుల్ ఇప్పటి నుంచి యధాతథంగా నడుస్తుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు కోరారు.

- కొనుగోలు కేంద్రాలకు పోటెత్తుతున్న ధాన్యం
- రోజుల తరబడి ఎదురు చూస్తున్న రైతులు
- సమాధానం చెప్పలేకపోతున్న నిర్వాహకులు

# ఒక్క గింజా కొనలేదు..

హనుమకొండ సబర్బన్ : హనుమకొండ జిల్లాలో ఈ వానకాలంలో సుమారు 1.55 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఇందులో 50 వేల ఎకరాల వరకు బై బ్యాక్ పద్ధతిలో పలు విత్తన కంపెనీలు సాగు చేయిస్తుండగా, మిగతా లక్ష ఎకరాల్లో సాధారణ వరి పండించారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు పౌరసరఫరాల శాఖ డీఆర్డీవో, పీఏసీఎస్ ఆధ్వర్యంలో154 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. నెల రోజులుగా జిల్లాలోని ఎల్కతుర్తి, కమలాపూర్, భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఐనవోలు, హసన్‌పర్తి, వేలేరు మండలాల్లో వరి కోతలు జరుగుతున్నాయి. ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ఆరబోసుకోగా, నిర్ణీత తేమ కూడా వచ్చింది. అయితే సెంటర్లు ప్రారంభించి 20 రోజులైనా ఇప్పటి వరకు క్వింటా ధాన్యం కూడా కాంటా జరగలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయమై నిర్వాహకులను అడిగితే తమకేం తెలియదనే సమాధానం వస్తున్నదని అన్నదాతలు వాపోతున్నారు. సన్న బియ్యానికి బోనస్ నుంచి



ఎల్కతుర్తి మండల కేంద్రంలో ధాన్యం రాశులు

సాధ్యమైనంత మంది రైతులను తగ్గించేందుకు ప్రభుత్వం కొనుగోళ్లలో జాప్యం చేస్తున్నదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోళ్లు మొదలవక పోవడంతో విసిగిపోయిన రైతులు తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఆయా కేంద్రాల్లో కాంటాలు లేనప్పటికీ ధాన్యం నింపేందుకు గన్నీలను మాత్రం సరఫరా చేశారు. దీనికి తోడు ఆయా సెంటర్లకు సంబంధించి మిల్లులను కూడా కేటాయించకపోవడంతో కొనుగోల్లు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా ప్రతిరోజు కురుస్తున్న వర్షంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.



సెంటర్లకు తరలిస్తున్న గన్నీ బ్యాగులు



జనగామ వ్యవసాయ మార్కెట్‌లో పేరుకుపోయిన ధాన్యం నిల్వలు

# ఎక్కడి వడ్లు అక్కడే

### పది రోజులైనా కాంటా కాలేదు..



పాలకుర్తి : మల్లంపల్లిలో ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పది రోజులైంది. ఇప్పటి వరకు ఏ అధికారి రాలేదు. ఏఈవో లేడు.. ఏవో రాలేదు.. కాంటాలు కావడం లేదు. కనీసం తేమ చూసే వారు లేరు. పైగా ఈ కోనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి ప్రారంభించారు. ఒక్క బస్తా కూడా కాంటా కాలేదు. వర్షం పడగానే పరదాలు కప్పుడు.. ఎండ రాగానే ఆరబోసుడైతాంది ఇక్కడి రైతులకు. అధికారులు స్పందించి కోనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి.

– పుర్మ రఘుపాల్‌రెడ్డి, రైతు, మల్లంపల్లి

### కొనుగోలు కేంద్రాల నుంచి కదలని నిల్వలు

- బ్యాంకు గ్యారెంటీ కొర్రీతో మిల్లర్ల వెనకడుగు
- జనగామలో సీఎంఆర్ సేకరణకు అడ్డంకులు
- అకాల వర్షాలతో కల్లాల్లో తడిసిపోతున్న ధాన్యం

జనగామ, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ఆరుగాలం శ్రమించి సాగు చేసిన వరి ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. కొనేవారు లేక కొనుగోలు కేంద్రాల్లోనే రోజుల తరబడి పడిగాపులు పడుతున్నారు. కాంటాలు కాక కొందరు.. కొనుగోళ్లు జరిగి మిల్లులకు తరలించక మరికొందరు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ధాన్యం తడిసి అన్నదాతలు మరింత నష్టపోతున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే జనగామ జిల్లాలో 30 నుంచి 45 రోజుల ముందుగానే సాగు పనులు మొదలై సెప్టెంబర్ చివరి నుంచి కోతలు ప్రారంభమవుతాయి. దీనికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అధికారులు ఆలస్యం చేస్తున్నారు. సీజన్ ప్రారంభమై దాదాపు 45రోజులు గడుస్తున్నా వారం క్రితం వరకు 30 శాతం కొనుగోలు కేంద్రాలే ప్రారంభించడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోయారు. అయితే రెండు, మూడు రోజులుగా పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ సీఎంఆర్, సన్న ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం రైస్ మిల్లర్లకు విధించిన తాజా ఆంక్షలు జిల్లాలో ధాన్యం సేకరణకు గుదిబండగా మారాయి. సన్న ధాన్యం కొనుగోలుకు ఇప్పటికే మిల్లర్లు విముఖత చూపుతుండగా, డిఫాల్టర్లకు సీఎంఆర్ ఇచ్చే ప్రసక్తేలేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. వానకాలం ధాన్యం కేటాయింపు విషయమై పలు నిబంధనలతో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 27 కొత్త చిక్కులు తెచ్చింది. మిల్లర్లు బ్యాంకు గ్యా రెంటీ లేదా సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని, దొ డ్డు రకం ధాన్యం క్వింటాకు రూ. 30, సన్నాలకు రూ. 40 చొప్పున మిల్లింగ్ చార్జీలు చెల్లిస్తామని, అది కూడా గడువులోపు పూర్తి చేస్తేనే అని అందులో స్పష్టం చేసింది. జిల్లాలో 45 రారైస్, 21 పారా బాయిల్డ్ మిల్లులుండగా, అందులో 6 రారైస్, ఒక పారా బాయిల్డ్ మిల్లు డిఫాల్టర్ జాబితాలో ఉన్నాయి. జిల్లాలో 3,48,0 68 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, 2,67,1 78 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం, 1.10 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం సేకరణ లక్ష్యంగా 180 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే సన్న, దొడ్డు రకం కలిపి 3.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యానికి ఇప్పటి వరకు కేవలం 561 మెట్రిక్ టన్నులే కొనుగోలు చేశారు.



జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఐకేపీ కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్న రైతులు

కొత్తగా ప్రభుత్వం జారీ చేసిన జీవో 27తో జిల్లాలో ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు మిల్లర్లు ముందుకు రావడంలేదు. కొన్నిచోట్ల కాంటాలు వేసిన ధాన్యాన్ని ప్రభుత్వ గోదాంలకు తరలిస్తున్నా, అనేక ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్లలో కొనుగోలు చేసిన ధాన్యం తరలించకపోవడంతో ఎక్కడి నిల్వలు అక్కడే పేరుకుపోయాయి. మరికొన్ని చోట్ల రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా ప్రభుత్వరంగ సంస్థలు పట్టించుకోవడం లేదు. పాలకుర్తి ప్రాంతంలో రైతులు కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 10 రోజులు దాటుతున్నా ఇవాళ, రేపు అంటూ అధికారులు దాటవేస్తున్నారు. అకాల వర్షానికి ఇప్పటికే పలు మార్లు ధాన్యం తడిసి ముద్దయ్యిందని రైతులు వాపోతున్నారు. కాగా, గతంలో కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ చేయక బ్లాక్ లిస్టులో ఉన్న మిల్లర్లకే బ్యాంకు గ్యా

### మిల్లర్ల అయోమయం

రెంటీలతో ధాన్యాన్ని కేటాయించాలని, సకాలంలో డెలివరీ చేసిన మిల్లులను మినహాయించాలని మిల్లర్లు కోరుతున్నారు. బ్యాంకు గ్యారెంటీ, సెక్యూరిటీ డిపాజిట్ వారం, పది రోజుల్లో ఇస్తామని బాండ్ పేపర్‌పై రాసిస్తే మిల్లులకు సీఎంఆర్ కేటాయిస్తామన్న వెసులుబాటును జిల్లా యంత్రాంగం కల్పించినా నేటికీ సగం మంది యజమానులు కూడా ముందుకు రాలేదు.

### ట్యాగింగ్ చేపట్టాం..

ప్రభుత్వ కొత్త మార్గదర్శకాలపై స్పష్టత కోసం కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభయ్యాయి. మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ, సెక్యూరిటీ డిపాజిట్ వంటి అంశాల్లో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా కలెక్టర్ ఆదేశాలతో నిర్ణీత గడువులోపు వాటిని ఇస్తామని హామీ పత్రాలు తీసుకొని రైస్ మిల్లులకు ట్యాగింగ్ ప్రక్రియ చేపట్టాం. ఒకటి, రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అవుతాయి.

– హతీరాం, పౌరసరఫరాల శాఖ మేనేజర్, జనగామ జిల్లా

### సన్నాల సేకరణకు విముఖత..

కొత్త జీవో మేరకు క్వింటాకు 67 కిలోల చొప్పున బియ్యం ఇవ్వడం సాధ్యంకాదని, అలా చేస్తే సుమారు రూ. 300కు పైగా నష్టం వస్తుందని రా రైస్ మిల్లర్లు చెబుతున్నారు. దీంతో సీఎంఆర్ కింద సన్న ధాన్యం సేకరణకు విముఖత చూపుతున్నారు. తమకు జరిగే నష్టాన్ని ప్రభుత్వం భరిస్తే తీసుకునేందుకు తాము సిద్ధమని, దీనిపై స్పష్టత వస్తే తప్ప ముందుకు వెళ్లేది లేంటున్నారు. అలాగే పాత మిల్లింగ్ యార్జీలు, ఇతర బకాయిలు ముందుగా చెల్లించాలని, వీటితోపాటు గన్నీ బ్యాగుల విషయంలోనూ స్పష్టత ఇవ్వాలంటున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం పెంచిన మిల్లింగ్ చార్జీలు సరిపోవని, పక్క రాష్ట్రాల్లో పరిశీలించి ఆ మేరకు ఇవ్వాలని కోరుతున్నారు.




బహిరంగ విచారణలో మాట్లాడుతున్న తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, పక్కన కమిషన్ సభ్యులు, కలెక్టర్లు

# వినతులు విన్నాం.. ప్రభుత్వానికి నివేదిస్తాం..

బహిరంగ విచారణకు అందరి సహకారం మరువలేనిది

- వరంగల్ జిల్లా ప్రజలు చైతన్య వంతులు
- విభిన్న అంశాలపై విజ్ఞప్తులు అందజేశారు
- హైకోర్టు నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు
- బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

హనుమకొండ, నవంబర్ 2 : స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం కల్పించాల్సిన రిజర్వేషన్లపై చేపట్టిన బహిరంగ విచారణలో వివిధ సంఘాల నుంచి వినతులు విన్నామని, దానిని ప్రభుత్వానికి నివేదిస్తామని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీ కులాలు, రిజర్వేషన్ల పునర్వ్యవస్థీకరణ జరగాలని, జనాభా దామాషా ప్రకారం రాజకీయాల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ సంఘాల నేతలు కోరినట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం సాయంత్రం హనుమకొండ కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. హనుమకొండ కలెక్టరేట్‌లో జరిగిన బహిరంగ విచారణకు వచ్చే ముందు బృందం సభ్యులతో కలిసి భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. బహిరంగ విచారణలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారని, లిఖిత పూర్వకంగా వినతులు అందించారని చెప్పారు. బీసీలపై జరుగుతున్న దాడులు అరికట్టేందుకు అట్రాసిటీ చట్టం తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. దూదేకుల, ఇతర మైనారిటీ వర్గాల వారు కూడా తమకు ఇతర కులస్తుల మాదిరిగా అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. కుల నిర్మూలన సంఘం సైతం నో క్యాస్ట్.. నో రిలిజియన్ సర్టిఫికెట్ జారీ చేయడంతో పాటు 5 శాతం రిజర్వేషన్ కల్పించాలని వినతి పత్రం అందించిందన్నారు. ఈ విచారణ సందర్భంగా ఏ జిల్లాలో లేని విధంగా ఇక్కడ బాలికల హాస్టళ్లలో సౌకర్యాలు లేవని, అనేక సమస్యలకు నిలయంగా మారాయని మహిళలు ఫిర్యాదు చేశారన్నారు. బహిరంగ విచారణకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. నాసిరకంగా విద్యుత్ సరఫరా చేయడంతో ఇస్త్రీ పెట్టెలు కాలిపోతున్నాయని, అలాగే నాలాలపై ఉన్న ఇస్త్రీ డబ్బాలను తొలిగిస్తున్నారని రజకులు తమ దృష్టికి తీసుకొచ్చారని, ఈ అంశాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు. ఈ విచారణలో దాదాపు 235 విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏ జిల్లాలో లేని విధంగా ఇక్కడ మంచి స్పందన ఉందని, బీసీలంతా ఐక్యతతో ఉన్నారని అన్నారు. అంతేకాక ఇక్కడి విభిన్నమైన అంశాలపై బీసీ సంఘాల నేతలు విజ్ఞప్తులు అందజేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి సమగ్ర కుటుంబ సర్వే చేపడుతున్నదని, దీనిని కుల సంఘాలు, ప్రజలు విజయవంతం చేయాలన్నారు. కులగణన, రిజర్వేషన్ అమలు విషయంలో తమకు హైకోర్టు నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని నిరంజన్ చెప్పారు. కోర్టు నిబంధనల మేరకే బీసీ కమిషన్ పనిచేస్తుందన్నారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి, హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు పీ ప్రావీణ్య, డాక్టర్ సత్యశారద తదితరులు పాల్గొన్నారు.



బీసీ కమిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్

### వరంగల్ సీపీ సీరియస్

**రాణాలో యువకుడి ఆత్మహత్యాయత్నంపై విచారణకు ఆదేశం**

మట్టెవాడ, నవంబర్ 2: వరంగల్ జిల్లా మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఓ యువకుడి ఆత్మహత్యాయత్నం ఘటనపై వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా సీరియస్ అయినట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై విఠల్ వేధింపులు భరించలేనంటూ శ్రీధర్ అనే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పలు దినపత్రికలతోపాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై సీపీ అంబర్ కిశోర్‌ఝా సీరియస్ అయినట్లు సమాచారం. యువకుడు పోలీస్‌స్టేషన్‌కొచ్చి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడమేంటని మట్టెవాడ పోలీసులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ ఘటపై విచారణ చేసి నివేదికను అందించాలని మట్టెవాడ పోలీసులను సీపీ ఆదేశించారు. నివేదిక అనంతరం చర్యలు ఉండనున్నాయి.

### 10న ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-13 చదరంగ ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 2 : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 10న హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో బాలబాలికలకు ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి అండర్–13 చదరంగ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 1, 2011న, ఆ తర్వాత జన్మించిన వారు పోటీలకు అర్హులని, ఇందులో గెలుపొందిన నలుగురు బాలురు, బాలికలు డిసెంబర్‌లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి చదరంగ పోటీలో పాల్గొంటారని తెలిపారు. పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేస్తామని, క్రీడాకారులు తమ వెంట చెస్‌బోర్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 90595 22986లో సంప్రదించాలని కోరారు.



పరుగు పందెంలో పోటీ పడుతున్న మహిళా క్రీడాకారులు

# ఆటలపై ఆసక్తి పెంచుకోవాలి

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి
- ఖమ్మంలో అట్టహాసంగా ప్రారంభమైన ఇంటర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలు

ఖమ్మం సిటీ, నవంబర్ 2 : విద్యార్థులు, యువత ఆటలపై ఆసక్తి పెంచుకుంటే పోటీతత్వంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందని కేయూ రిజిస్ట్రార్ పీ మల్లారెడ్డి అన్నారు. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో కాకతీయ యూనివర్సిటీ పరిధి ఇంటర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ క్రీడలతో దేశ ప్రతిష్ట సైతం పెరుగుతుందనే వాస్తవాన్ని ప్రతి క్రీడాకారుడు గమనించాలన్నారు. కేయూ పరిధిలో నిర్వహిస్తున్న క్రీడల విజయవంతానికి పలు రకాల కమిటీలు వేసి మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వెంకయ్య ఇప్పటి వరకు మూడు దశల్లో నిర్వహించిన పోటీల్లో దాదాపు వేయి మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను చాటి వెలుగులోకి వచ్చారని రిజిస్ట్రార్ వెల్లడించారు. కార్యక్రమానికి ఖమ్మం యూపీసీఈ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ అధ్యక్షత వహించగా జిల్లా యువజన, క్రీడల అధికారి టీ సునీల్ రెడ్డి, కేయూ పీడీల సంఘం కార్యదర్శి డాక్టర్ బీ వెంకన్న, పీ శ్రీనివాస్, కోటి, అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, కార్యదర్శి ఎండీ షఫీ, పీడీలు శ్రీనివాస్‌రెడ్డి, రఘునందన్, ఏటీబీటీ ప్రసాద్, జే ఉపేందర్, సావిత్రి, లక్ష్మీకాంత్, సుధాకర్ పాల్గొన్నారు.



కేయూ అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

# భద్రకాళీ బండ్‌కు సరికొత్త శోభ



*వరంగల్ నగరంలోని భద్రకాళీ బండ్ సరికొత్త అందాన్ని సంతరించుకుంది. భద్రకాళీ చెరువు వద్ద ఈ బండ్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేయగా అప్పటి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. దీని సుందరీకరణ పనుల్లో భాగంగా కాకతీయ వీరనారి రాణీ రుద్రమదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వరంగల్ రామన్నపేట వైపు ఉన్న కాకతీయ కళాతోరణం ఎదురుగా దీనిని నెలకొల్పడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. భద్రకాళీ బండ్ లో కాకతీయ కళాతోరణం, త్రివర్ణ పతాకంతో పాటు తాజాగా రాణీ రుద్రమ విగ్రహం ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతం ఆకర్షణీయంగా మారింది.*

– వరంగల్ ఫొటోగ్రాఫర్, నవంబర్ 2